'ఇల్లు కట్టి చూడు, పెళ్ళి చేసి చూడు' అని చాలామంది అనటం నేను చాలా సార్లు వినటం జరిగింది. అయినా అంతగా పట్టించుకో లేదు ఆ మాటల్ని.

ఈ నాడు ఇల్లు కట్టి చూశాను—మా ఆవిడకి పుట్టింటోళ్ళు పెట్టిన అయిదు సవర్ల గొలుసు మాయమైంది. మా అత్తగారు నా కంటూ పెట్టిన పవరన్నర బంగారపు ఉంగరం మాయమైంది. మా నానిగాడికి మా అమ్మ పెట్టిన బంగారపు వాచీ మాయమైంది. బ్యాంకు బాలన్సూ మాయమైంది. స్థలం తాకట్టు కింద కూర్చుని, నెత్తిన ఒక ఇల్లుని నిలబెట్టుకుంది.

దాదాపు ఇల్లు పూర్తయిందని నే అనుకుంటుంటే—"ఇల్లు మొదలెట్టావే, శర్మా!" అని చూసిన వాడల్లా అన్నప్పుడు నా కడుపులో చెయ్యి పెట్టి దేవిన ట్లయేది.

"ఇల్లు పూర్తయి రెండు నెల లయినా సిమెంటు విషయం పట్టించుకో వేంరా?" అని మా అమ్మ అన్నప్పు డల్లా సవాలక్ష సమస్యలు తలెత్తేవి.

'ఇల్లు పూర్తి కాలేదు' అనే విషయాన్ని గుర్తు తెచ్చి గుచ్చి గుచ్చి మరీ చూపించేది ఇంతవరకూ మా ఇల్లు నోచుకోని సిమెంటు పూత.

సిమెంటు అనే పదార్థాన్ని నాలిక మీద రుచి చూసి ఎరగని మా గృహ కన్యను చూసిన వాడల్లా 'పాపం' అని పెదవి విరిచి వెళ్ళేవాడు. అరకాల్చు రాయితో, అడుసుతో, సున్నంతో అలా బేలగా నిలబడి పోయేది.

దానికిగాను ప్లాస్టింగు చేయించుదా మని ఇల్లు ప్లాను గీయించుకున్న నాడే అప్లికేషను గీకి తాలూకా ఆఫీసులో పడేశాను, నా తప్పు లేకుండా.

"వచ్చేది వర్షాకాలం. ఆ సిమెంటు గొడవ కాస్త తేల్చరా" అని మా అమ్మ కనిపెట్టిం దో కొత్త స్లోగన్.

నిజమే మరి. నాలుగు రోజులనించీ సాయంత్రం పూట మబ్బు పట్టే విషయం నే ఎరగక కాదు. కానీ ఏం చేయగలను! అప్పటికీ తిరుగుతూనే ఉన్నాను. ఒక్కోడి చుట్టూ పదేసి సార్లు.

"ఇల్లు కట్టుకోవడాని కో ఇరవై బస్తాలు సిమెంటు కావాలి బాబోయ్" అనినాలుగైదుసార్లుతెల్లవారు ఝామున నిద్రలో కేకలు పెట్టానటకూడా. తెల్లా రాక మా ఆవిడ చెబుతుంటే సిగ్గు పడిపోయేవాణ్ణి—అసమర్థతకు బాధపడే వాణ్ణి.

మొన్న సాయంత్రం తుప్పర పడి నప్పటినుంచీ భయం మరీ పుంజుకుంది. ఒక మాదిరి వర్షం కురిస్తే పరవాలేదు. వర్షానికి గాలి తోడైతే?

'బాప్‌రే' అనిపించింది.

"వర్షం కురిస్తే బాగుండు. బడి కెళ్ళకుండా ఉండొచ్చు." శాంతి వాసుతో అంటుంటే విన్నాను.

"శాంతీ!" గట్టిగా పిలిచాను.

వణికిపోతూ ముందు కొచ్చింది.

"వర్షం కురిస్తే బాగుండా?" లాగి చెంప కేసి కొట్టాను. ఏడుస్తూ వెళ్ళి పోయింది.

గుండె ఒక్కసారి ఝల్లుమంది.

'ఎంత అసమర్థుణ్ణో' అనిపించింది.

"ఎందుకు శాంతి మీద విరుచుకు పడ్డావ్?" అంతరాత్మ.

"ఆ మాట అన్నందుకు?"

"ఒక చిన్న పిల్లకు అలాంటి కోరికలు ఉండటం సహజమే!"

"కావచ్చు. కాని వర్షం పడితే ఇంటికి ప్రమాదం కదూ?" నా జవాబుకీ, నా అవివేకానికీ, నా అజ్ఞానానికీ ఉరేసు కుందా మనిపించింది.

వెధవతో చెలగాటం కత్తితో కబాడీ ఆడటం లాంటి దని ఆత్మకు తెలుసు కాబోలు మాయమైంది.

ఆఫీసు వదలగానే తాలూకా ఆఫీసు కెళ్ళాను. బయట జవాను కూర్చుని ఉన్నాడు.

"పెద్దోళ్ళతో మాట్లాడుతున్నారు అయ్యగారు."

నాకు కామన్‌సెన్సు నేర్పుతున్నాడు జవాను—నవ్వుకున్నాను.

రెండు గంటల వరకూ కూర్చున్నాను.

"నో—నో, సర్. ఈ మాత్రానికే ఎందుకు లెండి?" అయ్యగారి గొంతు.


"పర్లే ఇదుంచండి." పెద్దాయన గొంతు.

క్షణం నిశ్శబ్దం.

"మొత్తానికి భలేవారే?" అయ్య గారు.

జోకులు...నవ్వులు.

నా ఎదురుగా డ్రింక్స్ వెళ్ళాయి—ఖాళీ సీసాలు కదిలి వచ్చాయి.



బెల్ మోగింది. జవాను లోని కెళ్ళాడు.

రెండు నిమిషాల తరవాత అంతా బయటకు రావడం, జీపెక్కడం, నా ముఖాన దుమ్ము కొట్టి జీప్ వెళ్ళి పోవడం జరిగిపోయింది.

కళ్ళల్లో నలక పడ్డట్టుంటే నులుము కున్నాను. కంటిలో సన్నని నీటిపొర నిలిచినట్టు తెలుసుకోవడానికికూడా సిగ్గు పడ్డాను.

ఇంటికి చేరేసరికి ఒంట్లో శక్తి కూడా సన్నగిల్లింది.

"కనుక్కున్నావట్రా?" వంట గది లోంచి అమ్మమాట వినిపించింది. ఎందుకో మరి అమ్మ మామూలుగా మాట్లాడుతున్నా భయపడాల్సొస్తూంది. ఎందుకు? ఎందుకో మరి?

"లేదు. ఆఫీసు పన్లు ఎక్కువగా ఉంటే వెళ్ళలేకపోయాను." అసమర్థతని విడమరిచి చెప్పుకునే శక్తి ఏ వ్యక్తికీ ఉండదు కూడా.

"నీ పిట్లానే జాప్యం చేస్తాడు. సిమెంటు బస్తాలు దొర్లుకుంటూ వస్తాయి ఇంటికి..." అమ్మ ఈసడింపులు కూడా భరించాల్సొస్తూంది.

"మీరు మాత్రం వారి చుట్టూ ఎన్నిసార్లు తిరుగుతారులెండి? బ్యాంకున ఏమైనా ప్రయత్నించక పోయారా?" భోజనం వడ్డిస్తూ అంది.

"బ్యాంకున మనం భరించగలమా జానీ!"

"......."

"ఇప్పటికైన అప్పులే తీర్చడం ఎలా అని ఆలోచిస్తున్నా."

"తక్కువ వడ్డీకి ఆఫీసులో ఏమన్నా లోనుకు ప్రయత్నించక పోయారా?"

"కష్టమే మరి. ఇప్పటికైనదాన్ని తీర్చేస్తే గాని ఇవ్వరు."

ఇల్లు కట్టక పూర్వం మేం భోజనం చెయ్యడానికి కూర్చున్నామంటే భోజనం జోకులతోనూ, సరసాలతోనూ పూర్తయేది. ఇప్పుడో? భోజనంచెయ్యడమంటే చేసిన అప్పుల గురించి కాన్ఫరెన్స్ పెట్టినట్టే.

మరుసటి రోజు ఆఫీసుకెళుతూ తాలూకా ఆఫీసు కెళ్ళాను. గుమాస్తా కనిపించాడు లోపల. ఆయనగా రెప్పుడూ దొరకడు. ఎప్పు డెళ్ళినా "ఇప్పుడే బయట కెళ్ళాడు" అని చెపుతుంటా రందరూ. బాండేమన్నా వ్రాసుకున్నారేమో!?

"ఎన్నాళ్ళని తిరగాల్సార్?" ధైర్యం కూడదీసుకున్న ట్లనిపించింది. అయినా దీనత్వం కనిపించింది.

"ఏం చేస్తాం చెప్పండి? రెవెన్యూ ఇన్‌స్పెక్టరు తహసీల్దారుకి వ్రాయాలి. తహసీల్దారు కలెక్టరుకి వ్రాయాలి. సిమెంటు డీలర్లంతా కలెక్టరు చేతిలో బరువు పెడితేగాని సిమెంటు శాంక్షను కాదు." కాఫీ హోటలు వైపు నడిపిస్తూ చెప్పుకొస్తున్నాడు గొలుసు కథని.

"అయితే ఇప్పుడల్లా రావడం కష్టమంటారా?"

"కష్టమంటే...కాదనుకో,..." హోటల్లోకి లాక్కెళ్ళాడు.

టిఫినూ, కాఫీ పూర్తయ్యేవరకూ దేశంలోని సిమెంటు కొరతను గురించి కొంతసేపు, తెలుగు మహాసభలకంటూ కౌలాలంపూర్ వెళ్ళి వచ్చిన తెలుగోళ్ళ గురించి కొంతసేపు చర్చించాడు.

కనీస మర్యాదకైనా బిల్లు లాక్కునే ప్రయత్నం చెయ్యకపోవటం నాకు చాలా బాధ అనిపించింది.

"అసలు మీ పర్మిట్టు నంబ రెంత?"

"మూడు వందల పన్నెండు."

"అబ్బో! ముందే ఉందిగా!" హేళన ధ్వనించింది. భరించాను.

"సాయంత్రం కనిపించండి సార్."

తేలిగ్గా వదిలించుకునే మార్గమది.

నేను నాలు గడుగులు నడిచి వెనక్కి తిరిగి చూశాను. బంకు దగ్గర సిగ రెట్టు దమ్ము లాగి గాల్లోకి వూదుతూ ఒళ్ళు విరుచుకుంటున్నాడు. భుజానున్న శవా న్నొదిలించుకున్నంత ఆనందం కనిపిస్తోంది, ఆ ఒళ్ళు విరుపులో. నాకు ఒళ్ళు మండుకొచ్చింది. అయినా ఏం చేయగలను?

నే ఆఫీసులో ఉండగానే మబ్బు పట్టింది. తుప్పర పెరిగి వర్షంగా మారింది.

"బంగాళాఖాతంలో వాయు గుండమటగా!?"

మా సెక్షనులోని సోమసుందరం రామారావుతో అంటుంటే విన్నాను.

గుండెలో రైళ్ళు ... ఒంట్లో సన్నని వణుకు.

"ఏ ఏరియాలో పడిందో?" తాపీగా అడగాలని తాపత్రయం. అయినా మాటలు తడబడ్డాయి.

"మద్రాసుకి దగ్గర్లో పడిందట.

అలహాబాదు బ్యాంక్ ట్రావెలర్స్ చెక్స్ ద్వారా నిరపాయంగా ప్రయాణం చెయ్యండి.

## ట్రావెలర్స్ చెక్స్ గురించి మీకు తెలియవలసిన ముఖ్యా అంశాలు



□ వాడకానికి ముందుగా ట్రావెలర్స్ చెక్స్‌పై సంతకం చెయ్యకండి. డబ్బుగా మార్చే సమయంలో బేంకర్ ముందు మాత్రమే సంతకం చెయ్యండి.

□ చెక్స్‌ని సురక్షితమైన ప్రదేశంలో ఉంచండి. ఒక వేళ పోయినట్లయితే వెంటనే చెక్స్ ఇచ్చిన ఆఫీసుకు తెలియ చెయ్యండి.

అలహాబాదు బ్యాంకు
భారత ప్రభుత్వ సౌజన్యంలో

Phoenix AB-2/82 TEL

విశాఖ వైపుగా వడుస్తూందట." తల ఫైల్లోనే ముంచి జవాబు చెప్పాడు.

గుండె ఒక్క క్షణం పని చేయడం మానేసింది.

ఫైల్లో అక్షరాలు వక్రముంగా కనిపించడం లేదు!

చేతిలో పెన్ను నడవడం లేదు.

జేబులోంచి రుమాలు తీసి నుదురు అద్దుకుంటూ ఆఫీసు వరండాలోకి వచ్చాను. బయట వర్షం...అయినా నా నుదుటి మీద చెమట.

సిగరెట్ వెలిగించాను. పూర్తిగా కాల్చలేక పోయాను.

ఆఫీసు గడియారం అయిదుసార్లు అరిచింది.

రిక్షా పిలిచాను ఇల్లు చేరేందుకు.

"తాలూకా ఆఫీసు వైపు పోనియ్" అన్నాను, ఏదో గుర్తు కొచ్చినట్లు.

తాలూకా ఆఫీసు ఉద్యోగస్థులు నా వైపు జాలిగా చూస్తున్నారు. రెండు నెలల నుంచీ కుక్కలా తిరుగుతున్న నేను బహుశా జాలి గొలిపిస్తున్నానేమో! వాళ్ళ చూపుల్ని తట్టుకోలేకపోయాను.

"మీ అప్లికేషను ఇంకా రెవెన్యూ ఇన్స్పెక్టర్ గారి వద్ద నుంచి రాలేదార్." కేక వేసినట్టు చెప్పాడు గుమాస్తా.

"కోటా వచ్చిందట. రేపో, ఎల్లుండో శాంక్షను చేస్తారు. రెవెన్యూ ఇన్స్పెక్టరు గారి వద్ద నుంచి ఆ కాగితం ఇక్కడకు చేరేట్టు చూసుకుంటే చాలు. వన్నైపోయినట్టే." సిమెంటు చేతి కందిచ్చినంత తేలిగ్గా చెప్పేశాడు.

నుదుటి మీది నరాలు జివ్వున లాగుతున్నట్టనిపించింది. భారంగా రిక్షా ఎక్కాను. "రెవెన్యూ ఇన్స్పెక్టరు ఆఫీసుకు పోనియ్" అన్నాను.

ఆఫీసులో మునసబు ఉన్నాడు, ఏదో పని చూసుకుంటూ.

"నాలుగైదు రోజుల వరకూ కాంపు మీదే ఉంటారు." రెవెన్యూ ఇన్స్పెక్టర్లు ఉనికి చెప్పాడు అతను, పక్కలో బాంబు పేల్చినట్లు.

ఏమిటీ ఆట?

అటు తాలూకా ఆఫీసు వాళ్ళూ, ఇటు రెవెన్యూ ఇన్స్పెక్టరూ ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారు నన్ను.

ఇంటికి చేరడం మామూలే.

ఇల్లు చేరేసరికి జానకీ, అమ్మా ఒక మూల కూర్చొనున్నారు. శాంతీ, నానీ అన్నం తింటున్నారు.

ఆకాశంలో మబ్బులు పట్టినట్టుగ ఉన్నాయి వారి ముఖాలు.

అయిష్టంగానే భోజనం చేశాను.

అమ్మేం మాట్లాడలేదు. అదే బాధ అనిపించింది. అడిగితే విషయమంతా చెప్పేద్దామనుకున్నాను. నేను స్వయంగా కదిలించడం బాగోదనిపించింది.

జానకీ మౌనముద్రే.

నాకు నిద్ర పట్టలేదు తెల్లవారు జాము వరకూ. అప్పటి వరకూ ఉంది వర్షం—కురుస్తూ వెలుస్తూ.

నిద్ర లేచేసరికి అమ్మ గొణుగుడు వినిపించింది.

"వీడికి లక్ష సార్లు చెప్పాను ఆ సిమెంటు విషయం కనుక్కోరా అని. వీలుగాక పోతే అప్పో, సప్పో చేసి బ్లాకు నన్నా కొనుక్కోవచ్చు కదా. నా మాట ఏ నాడు లెక్క చేశాడు కనక ఈ నాడు లెక్క చెయ్యటానికి!"

అంత పొద్దున్నే సుప్రభాతం వినిపించాల్సిన అవసరం ఏం వచ్చిందో నేను బయటి కొచ్చి చూస్తే కాని అర్థం కాలేదు.

వర్షానికి అడుసు కరిగి నేల జారుతూంది. రాయికీ, రాయికీ మధ్య స్థలం తాపీ పెట్టి గీకినట్టుగా కనిపిస్తూంది. వర్షానికి ఇంకాస్త గాలి తోడైతే?

"అమ్మో!" ఒకసారి గుండెలో వడిసెల విసురు.

ఆ రోజల్లా ముసురుగానే ఉంది.

రేడియో తుఫాను హెచ్చరికలు చేస్తూంది.

ఉండి ఉండి గాలి—సన్నగా వాన — ఉరుములూ, మెరుపులూ.

జీవితంలో ఇంత విపత్కర పరిస్థితిలో నే నే నాడూ ఇరుక్కో లేదు.

క్షణ క్షణానికీ గుండెలో వణుకు.

బయట జల్లు పడటం పెరుగుతుంటే గుండెలో ఘల్లు మనటం పెరుగుతూంది పదింతలుగా.


". . . దీని ఫలితంగా రాగల నలభై ఎనిమిది గంటల్లో కృష్ణా, గుంటూరు, నెల్లూరు, విశాఖపట్నం జిల్లాల్లో భారీగా వర్షం పడవచ్చు. పెనుగాలులువీచవచ్చు."

సుందర్రావు తెచ్చిన పాకెట్ రేడియో లోంచి ఆకాశవాణి అరిచింది.

వర్షమంటే మా ఆఫీసులో వాళ్ళందరికీ ఉల్లాసమే. రెండు నెలల క్రితమయితే నేనూ బోలెడంత సంబరపడే వాణ్ణి. ఇప్పుడలా చెప్పుకోవడానికికూడా బాధగా ఉంది.

ఐదయ్యేసరికి సుందర్రావు పిలిచిన ఆటోలో "అక్కడిదాకా వద్దువు గానిరా" అంటే ఎక్కాను. అతని చేతిలోని రేడియోనిచూస్తుంటేఎందుకోభూతాన్ని చూసినట్టనిపిస్తూంది. ఆదే తుఫాన్ని సృష్టిస్తున్నట్టుంది నా కళ్ళకు.

వర్షం తగ్గు ముఖం పట్టే సూచనలు కనిపించ లేదు. ఆటోని మా ఇంటి వైపు తిప్పుతున్నాడు సుందర్రావు.




థాంక్స్ చెప్పుకున్నాను మనసులోనే, సుందర్రావుకు నాపై గల అభిమానానికి.

ఇల్లు చేరాను.

ఇల్లు తాళం వేసి ఉంది. ఆశ్చర్యపోయాను.

వరండాలోని కిటికీలోంచి పక్కనున్న డాబాలోకి చూశాను.

శాంతి చెయ్యి పెట్టి పిలుస్తూంది కిటికీ దగ్గర నుంచి.

వీళ్ళంతా అక్కడి కెందు కెళ్ళారో? కర్చీఫ్ నెత్తిన పరుచుకుని, పాంటుని మోకాళ్ళ వరకు ఎత్తి పట్టుకుని వాళ్ళిల్లు చేరాను.

"వర్షమూ, గాలీ వచ్చేట్టుగా ఉంది. ఆ ఇంట్లో ఉండటం మంచిది కాదు. ఇక్కడుందురు గాని రండని సీతారావమ్మత్తయ్యగారు పిలిస్తే వచ్చామండీ." జానకి సంజాయిషీ ఇచ్చుకుంది.

"భోజనం చేశారా?" అడిగిన వెంటనే నాలిక్కరుచుకున్నాను. ఇప్పుడు డడగాల్సిన ప్రశ్న కాదది. నా ప్రశ్న నా గొంతులోనే మిగిలి పోవటం అంత బాధలోనూ రవంత ఆనందం కలిగించింది.

అంతా మౌనంగా ఉండిపోయారు. కరెంటు ఆఫ్ చేసినట్లున్నారు. చీకటి చిట్టి తల్లి చిందులు తొక్కుతూంది. సరివిలోపూర్లోంచి వస్తున్నట్లుగా ఉంది గాలి రొద—వర్షం పెరుగుతూంది.

మోకాళ్ళ మధ్య తల పెట్టుకుని అలాగే కూర్చుండి పోయాను. జానకికి కునుకు పట్టి నట్టుంది. మధ్యలో నానీ గాడు ఏడుపు లంకించుకున్నాడు.

"హుష్— పూర్కోరా." అమ్మ వాడి నెత్తిన మొత్తటం వినిపించింది.

ఏడవు పెంచాడు వర్షం లాగా.

ఏడుపుహట్టం పూర్తయ్యాక — ఎక్కిళ్ళ మధ్యలో అడిగాడు—"కథ చెప్పు, నాన్నమ్మా" అని.

కథ చెప్పక తప్పదు. అది వాడి పట్టుదలకు నిదర్శనం.

అమ్మ కథ చెప్పటం మొదలు పెట్టింది.

"అనగనగా ఒక రాజు. ఆ రాజుకి ఏడుగురు కొడుకులు. ఏడుగురూ వేట కెళ్ళి ఏడు చేపలు తెచ్చారు. ఎండ బెట్టారు. అందులో ఒక చేప ఎండ లేదు. చేపా చేపా ఎందుకు ఎండలేదంటే. నాకు గడ్డిమోపు అడ్డమొచ్చిం దంది. గడ్డిమోపా గడ్డిమోపా ఎందు కడ్డమొచ్చావంటే, నన్ను గొల్లవాడు ఇప్పలేదంది. గొల్లవాడా గొల్లవాడా ఎందు కిప్పలేదంటే నా కవ్వ బువ్వ పెట్టలేదన్నాడు...

"ఆపండి గొడవ..." గట్టిగా అరిచాను. నా అవమానానికి అమ్మ కొంచెం దడిచింది. నానీగాడు కిక్కురుమనకుండా పడుకుండి పోయాడు.

వర్షం హోరు పెడుతోంది.

మనసంతా పిచ్చి పిచ్చి ఆలోచనలతో నిండి పోయింది.

ఆ ఎండని చేప లవా? తన అప్లికేషనా? గడ్డిమోపూ, ఆవూ, గొల్లవాడూ,అవ్వా, పిల్లోడూ—తహసీల్దారూ, రెవెన్యూ ఇన్స్పెక్టరూ, గుమాస్తా, జవానూనా? ఏమో — పోలికే అంది చావడం లేదు.

మనసంతా కల్లోలం — బయటి వాతావరణంలా.

వర్షమూ, గాలీ పెనవేసుకున్నట్లున్నాయి, శ్రీకృష్ణ రాధల్లా. వాతావరణం అంతా గంభీరంగా మారిపోయింది. వాటి శృంగారం అలకిస్తున్నట్లు మధ్యలో మెరుపులూ, ఉరుములూ—నాగస్వరంలా.

నిద్ర జోలికి రావడానికే భయపడుతూంది.

పెళపెళమంటూ శబ్దం వినిపించగానే గుండె ఝల్లుమంది. కిటికీలోంచి తొంగి చూశాను. వరండా ఇవతలి గోడ

విరిగిపోయి కనిపించింది, మధ్యలో మెరిసిన మెరుపులో.

కళ్ళు చెమ్మగిల్లినాయి.

భార్య మెడని బోసిచేశాను. బాంకు బాలన్సు క్లోజు చేశాను. స్థలం తాకట్టు పెట్టాను. ఆఫీసుకి బాకీ పడ్డాను.

ఇవి పూర్తయి రెండు నెలలయినా ఇంతవరకూ ఆనందంగా వూపిరి పీల్చిన క్షణం లేదు. ఎలా సాధ్యమవుతుంది? అయిన అప్పు గుండె మీద గుండ్రాయిలా కూర్చుంటే వూపిరి పీల్చడం సాధ్యమా?

తెల్లారింది"ట!"

అమ్మా, జానకి ఏడుస్తున్నారు.

పిల్లలు బిక్క మొహం వేసుకుని నిలబడి పోయారు.

నేనుమాత్రం అలానే కూర్చుండి పోయాను.

ఇరుగు పొరుగోళ్ళు చేరారు మా చుట్టూ.

ఓదారుస్తున్నారు.

వేలు కుమ్మరించి కట్టిన ఇల్లు— శిథిలమై కూలడానికి సిద్ధంగా ఉన్న ఏకశిలా భవనంలా తయారైంది. వరండా, వంట గదులూ, నేల ముట్టాయి. పోలుమాత్రం ఆధారంగా నిలబడింది— వెక్కిరిస్తూ.

పదకొండూ ఆ ప్రాంతంలో కనిపించాడు సూర్యుడు.

తెరిపి ఇచ్చింది.

బజారువైపు వచ్చాను — టిఫిను గానీ, పళ్ళుగానీ దొరుకుతాయేమోనని, పిల్లలకి... అంతా సలహా ఇచ్చారు. "ఇంట్లోకి మాత్రం వెళ్ళద్దు — ఆధారంగా నేనిలబడుందని."

హోటలుకి వెళ్ళాను. వెనుకనుంచి భుజం మీద చెయ్యి పడితే తిరిగి చూశాను. తాలూకా ఆఫీసు గుమాస్తా. ఎంత లోకువయ్యానో?

"అదృష్టవంతుడివోయ్. సిమెంటు అప్లికేషను మా దగ్గరే ఉంది. మొన్న ఫైల్లో సరిగ్గా వెతకలేదు. అందుకే కనిపించలా. ఈ రోజు తహశీల్దారుగారు శాంక్షను చేస్తారట. సాయంత్రం ఒక సారి ఆఫీసుకి రా. తీసుకెళ్దువుగాని. అన్నట్లు అప్లికేషను నంబరెంతన్నావు?"

నా మొహం చూసి భయపడ్డాడో, భంగపడ్డాడో నాకు తెలియదు.

"అగ్గరో — నే కూడా వస్తున్నా" అంటూ ఎవర్నో పిలుస్తున్నట్టు వెళ్ళిపోయాడు.

మెదడు మొద్దుబారిపోయింది. మనసు ఆలోచించే స్థితిని కోల్పోయింది. ★

# వారఫలాలు

**7-4-82 నుండి 13-4-82 వరకు**

## మేషం

ఈ వారం నుండి గత వారం కంటె మీకు ఎంతో కొంత అభివృద్ధి సర్వ రంగాలలోను గోచరింపక మానదు. గతంలో మీరు ఎదుర్కొనవలసి వచ్చిన అవరోధాలు క్రమ క్రమంగా తొలగి పోయి సుఖ శాంతులు లభించగలవు. మీ వృత్తి స్థానంలో కూడా అభివృద్ధి పొందుటకు అవకాశాలు లభింపనున్నవి. విరుద్యోగులు వ్యథ నొంద నక్కరలేదు. పెద్దల ప్రాపకం వలన మీ సమస్యలు పరిష్కరింపబడగలవు.

## వృషభం

ఈ వారంలో మీరు వూహించని కొన్ని సంతోషదాయకమగు సంఘటనలను అనుభవింపనున్నారు. సాహసంగా ఈ కాలం నూతన వృత్తి ఆరంభించుటకు అనుకూలప్రదం. వ్యాపారరీత్యా జీవించువారు తమ వ్యాపారాన్ని విస్తరించుటకు చేయగల ప్రయత్నాలు అనుకూలింపగలవు. ప్రభుత్వ సాయం. బ్యాంకుల వారి వలన ఋణాదులు లభించుట ప్రోత్సాహకరంగా ఉంటుంది. మంగళవారం శుభ దినం.

## మిథునం

విద్యార్థులలో ఉన్నత విద్య నభ్యసించు వారు, టెక్నికల్ విభాగాలయందున్న వారు ఈ వారంలో గురుని వలన విశేష అనుకూలం పొందనున్నారు. ప్రత్యేకించి పునర్వసు నక్షత్ర జాతకులకు ఈ రంగంలో గౌరవ మర్యాదలు ప్రాప్తింపగలవు. మీ శక్తి సామర్థ్యములను ఉన్నత వర్గీయులు గమనించుచున్నారు. ఇది భావి జీవిత మార్గంలో సుఖ శాంతులకు దోహదం కానున్నది.

## కర్కాటకం

మీ ప్రేమిపాత్రులైన వారి విషయాలలో గాని, మీ సంతానం విషయంలో గాని వారి అభివృద్ధిని వాంఛించి మీరు కానింపనున్న ప్రయత్నాలు, కృషి ఫలప్రదం అయ్యే అవకాశాలు అధికంగా ఉన్నవని భావిస్తారు. ఇది శుభకాలం. ఆస్తికంగా ఎలాంటి లోపం ఉండదు. కాని ఆర్జన ఫలం శ్రమానంతరంగాని లభింపదు. జీవితాన ఎడ్డించిన విస్తరి కాదను భావం ధ్రువపడుతుంది.

## సింహం

ఈ వారంలో మీరు ఆర్థిక రంగంలో గణనీయమైన అభివృద్ధి లభించుట సూచకం. వ్యాపారస్థులకు వ్యాపారవృద్ధి కూడా అధికంగా ఉంటుంది. పెట్టుబడి సంస్థలలో ఉద్యోగరీత్యా ఉన్నవారికి ప్రమోషన్ అవకాశాలు ఉన్నవి. షేర్లు వ్యాపారంగా కల వారు అధికంగా ఆర్జింప నున్నారు. స్థిరాస్తి విక్రయం వలన అధిక లాభాలు పొందుతారు. పర్యవసానంగా ఈ వారం అంతా ఏదో విధంగ ధన లాభానికి దోహదంగా ఉన్నది.

## కన్య

సుఖానుభూతికి దోహదమయ్యే కాలం. మనస్సు విశ్రాంతిని కోరుతుంది. శారీరకంగా కూడా విశ్రాంతి అవసరమని భావింపక తప్పదు. సుఖ వాంఛ తీవ్రత నొందుట విశేష పరిణామం. మీ కన్న ఉన్నత వర్గమందు, ఉన్నతాధికారమందు ఉన్న వారల ఆదరాభిమానాలు లభింప నున్నవి. గృహ వాతావరణం కూడా మీరు కోరిన రీతిగా ప్రశాంతంగా ఉండి మీ మనశ్శాంతికి సహకరింప నున్నది.

## తుల

ఈ వారం అంతా ఏదో ఒక వ్యాసంగం కల్పించుకొని తీరిక లేకుండా శ్రమింపగలరని తోస్తుంది. ఇందువలన సద్యఃఫలం శూన్యమని మీరు ఎరుగనివారు కాదు. కాని పెద్దలతో పరిచయమే గాక కొంత సన్నిహితం కూడా లభించుట భావి కాలంలో మీకు సహకరించవచ్చు. అయినా శారీరకంగా బాధ అనుభవింప నున్నారు. ఆరోగ్యం విషయంలో కడు జాగ్రత్త వహించుట అవసరం.

## వృశ్చికం

రాజ్యాంగ రీత్యా జీవింప దలచినవారు, అంటే ప్రజా ప్రతినిధులుగను పేరుతో గణింపదలచిన వారిలో అనూరాధ నక్షత్ర జాతకులు విషమ పరిస్థితుల నెదుర్కొనవలసి ఉంటుంది. ప్రజాభిమానం లభింపక పోవుట మీ ప్రయత్నాలకు అవరోధం కాదు గాని, వ్యయం అధికంగా పెట్ట నున్నారు. ధనుర్రాశులంగా రాజకీయ స్థాయిలో ఆధిక్యం పొందే అవకాశాలు మిమ్మల్ని అధికంగా ఆకర్షింప నున్నవి.

## ధనుస్సు

అవివాహితులగు స్త్రీలకుగాని, పురుషులకు గాని కావించే ప్రయత్నాలు కొంత వరకు అనుకూలించ నున్నవి. ప్రేమ కలాపాలలో పడి జీవితం కష్టములపాలు కాకుండా చూచుకోండి. మీరు ప్రేమించిన పురుషులుగాని, స్త్రీలుగాని మిమ్మల్ని ఇబ్బందుల పాలు చేస్తారు. ఇలాటి ప్రేమ వివాహాలు కష్టములకు దోహదము కానున్నవి. నీతి జీవితరంగంలో ప్రధానం గదా.

## మకరం

భాగస్వామ్య వ్యాపారం లాభదాయకంగా ఉంటుంది. భార్యాభర్తల అనురాగ సంబంధాలు వృద్ధిపొంద నున్నవి. స్త్రీల వలన లాభం ధన, లేక స్థిరాస్తి రూపంగా మీకు లభింప నున్నది. ఆర్థికంగా ఎలాటి ఇబ్బంది ఉండదు. సుఖ శాంతుల ననుభవించే కాలం. మీ వృత్తి రంగంలో మీరు కావించే కృషి ఇతరుల నాకర్షించి, మీకు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చి పెట్టనున్నవి.

## కుంభం

ఈ వారం అంతా మీరు మిశ్రమ ఫలాలను అనుభవింపనున్నారు. అపజయం తప్పదని భావించిన వానిలో అపజయం ఉండదు. జయం లభిస్తుందని భావించిన స్థానాలలోను, విషయాలలోను జయ సూచక లక్షణాలు క్షీణింపకున్నా జయంమాత్రం లభించదు. కాలాతీతమయ్యే పరిస్థితులు ఏర్పడగలందున మీరు మానసికంగా ఆందోళన చెందక తప్పదు. అయినా నిరాశ పడనక్కర లేదు.

## మీనం

మీరు ఈ వారం అంతా సామాన్య సుఖ శాంతుల నొంద నున్నారు. ఇతరుల విషయాలలో ప్రమేయం లేకుండా దూరంగా ఉండే ప్రయత్నాలు కావిస్తారు. ఇది మీపై ఆశ పెట్టుకొనిన వారికి నిరుత్సాహం, ఆశాభంగం కలిగింపక తప్పదు. ఇందువలన మీ వర్తమాన స్థితికి భంగం. లేకున్నా మీ మాటపై విశ్వాసం మీ అనుచరులకు తగ్గుతుందని, ఇది విశేష క్షేమం కాదని గమనించండి.

- దివాకరుని
వెంకట సుబ్బారావు